JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 07-01-2026
Medchal - Malkajgiri । Wednesday 07-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 222
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 222 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## మేకిన్ ఇండియాకు బూస్ట్



2 లో

**జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 6 :**

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత ప్రభుత్వం మన రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయడంపై మోదీ సర్కార్ దృష్టిసారించింది. ఈ క్రమంలో విదేశాల నుంచి ఆయుధాలు కొనుగోలు చేయడం కన్నా.... స్వదేశీ ఆయుదాల తయారీని ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా రక్షణ రంగానికి కేంద్రం భారీగా నిధులు విడుదల చేసింది. ఇది దేశ భద్రతను మరింత బలోపేతం చేయనుంది.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ నుంచి వచ్చిన యూఏఎస్ దాడులు భారత వాయు రక్షణ వ్యవస్థల బలాన్ని పరీక్షించాయి. రష్యన్ ఎస్-400 మిస్సైల్ వ్యవస్థ వాటిని అణిచివేసినప్పటికీ, దాని అధిక ధర, నిర్వహణ ఖర్చులు భవిష్యత్ అవసరాలకు పరిమితులు చూపాయి. ఇది స్వదేశీ సాంకేతికతలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది.ఈ మొత్తం పూర్తిగా దేశీయ ఉత్పాదకతకు కేటాయించబడింది, ఒక్క రూపాయి కూడా విదేశాలకు రాకుండా. పినాకా రాకెట్లు 120 కి.మీ. పరిధిలో శత్రు లక్ష్యాలను చేరుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. రాడార్లు, న్యూ ఏవీ డిఫెన్స్ వ్యవస్థలు యూఏఎస్‌లను గుర్తించి, అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

## కేంద్ర బడ్జెట్ 2026 తేదీపై సందిగ్ధత.. ఫిబ్రవరి 1న ప్రవేశపెడతారా..?

- 2026 కేంద్ర బడ్జెట్ తేదీపై నెలకొన్న గందరగోళం
- ఫిబ్రవరి 1 ఆదివారం కావడంతో తేదీ మార్పుపై చర్చ..
- గతంలోనూ వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భాలు.
- తుది నిర్ణయం పార్లమెంటరీ వ్యవహారాల కమిటీదేనని వెల్లడి.


2 లో

**జయభేరి, న్యూఢిల్లీ :**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న 2026 కేంద్ర బడ్జెట్ తేదీపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. 2017 నుంచి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయంగా వస్తోంది. అయితే 2026లో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీ మారుతుందా? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టవచ్చని కొన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## కవిత ఇంటికి క్యూ

- 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చబోతున్నా..
- మీరు లేకపోతే నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. మీరు నా బలం
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కవితకు అండగా ఉంటాం
- తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల కోసం పనిచేస్తాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



**జయభేరి, హైదరాబాద్, జనవరి 6 :**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటి వద్దకు భారీ సంఖ్యలో ఆమె అభిమానులు చేరుకున్నారు. 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చబోతున్నామని ఆమె ప్రకటించిన వెంటనే, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా సంఘాల నాయకులు, ...మిగతాది 2 లో



## పింఛన్ల పెంపుపై ప్రభుత్వం గుడ్ న్యూస్
# ముందుగా వాళ్లకే..

- ప్రస్తుతం ఇస్తున్న రూ.2,016 పింఛన్‌ను రూ.4,000కు, అలాగే దివ్యాంగులకు ప్రస్తుతం అందుతున్న రూ.4,016 పింఛన్‌ను రూ.6,000కు పెంచే దిశగా..

**జయభేరి, హైదరాబాద్ :**


దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీలను అమలు చేయడమే లక్ష్యంగా.. ఆసరా పింఛన్ల పెంపుతో పాటు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. ఈ క్రమంలోనే ముఖ్యంగా దివ్యాంగులకు నెలకు రూ.6,000 పింఛన్ అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మేరకు వృద్ధులు, ఇతర వర్గాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2,016 పింఛన్‌ను రూ.4,000కు, అలాగే దివ్యాంగులకు ప్రస్తుతం అందుతున్న రూ.4,016 పింఛన్‌ను రూ.6,000కు పెంచే దిశగా ఆర్థిక శాఖతో కలిసి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని

**ఆర్థిక శాఖ ప్రణాళిక:**

ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, ఇతర వర్గాలకు ఇస్తున్న రూ.2,016 పింఛన్‌ను రూ.4,000కు, దివ్యాంగులకు అందుతున్న రూ.4,016 పింఛన్‌ను రూ.6,000కు పెంచే ...మిగతాది 2 లో

## జిల్లాల పునర్విభజన క్రమపద్ధతిలో చేస్తాం

- బీఆర్ఎస్ నాయకులు తోకముడిచారు
- అసెంబ్లీలో పొంగులేటీ



**జయభేరి, హైదరాబాద్, జనవరి 6 :**

తెలంగాణలో గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా ఉందని, దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, కొందరిని సంతృప్తి పరచడం కోసమే గతంలో జిల్లాల విభజన జరిగిందని ఆయన ఆరోపించారు. ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల్లో కలవడం వల్ల అటు పాలనాపరంగా, ఇటు ప్రజలకు సేవలందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఈ లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. అశాస్త్రీయ విభజన వల్ల ప్రజలు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఉదాహరణకు, ఒకే నియోజకవర్గంలోని మండలాలు మూడు, నాలుగు వేర్వేరు జిల్లాల్లో కలిసి ఉండటం వల్ల అటు ఎమ్మెల్యేలకు, ఇటు సామాన్య ప్రజలకు పాలన దూరమైందని వివరించారు. అందుకే జిల్లాల సరిహద్దులను, రెవెన్యూ డివిజన్లను పునర్ వ్యవస్థీకరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి ప్రకటించారు. పాలనను ప్రజలకు మరింత చేరువ ...మిగతాది 2 లో

## టీమ్ వర్క్.. బెటర్ రిజల్ట్స్..
# ఇవే అభివృద్ధి మంత్రం

- 2026లోనూ పెట్టుబడుల ఫ్లో ఏపీ వైపే ఉండాలి
- విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చాం.. ట్రూ డౌన్ కు నాంది పలికా
- సూర్యలంక బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- 14వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- రూ.19,391 కోట్ల పెట్టుబడులకు, 11,753 ఉద్యోగాలకు ఆమోదం
- ఏపీ ఐటీ ఇన్ఫ్రా కనెక్ట్ పోర్టల్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి



**జయభేరి, అమరావతి, జనవరి 06 :**

2025వ సంవత్సరంలో టీమ్ వర్క్ తో చేయడం వల్లే పెట్టుబడుల్లో బెటర్ రిజల్ట్స్ సాధించామని... ఈ 2026లోనూ అదే ఉత్సాహంతో పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 14వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో వివిధ పెట్టుబడులను 14వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదించింది. 14వ ఎస్ఐపీబీ సమావేశంలో మొత్తంగా 14 సంస్థలకు చెందిన రూ.19,391 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా 11,753 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. దీంతో ఇప్పటి వరకు రూ.8,74,705 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించగా, 8,35,675 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎస్ఐపీబీ సమావేశం ప్రారంభం కాగానే మంత్రులు, సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025లో భారీ ఎత్తున ...మిగతాది 2 లో

## ఆసుపత్రిలో చేరిన సోనియా గాంధీ



**జయభేరి, న్యూ డిల్లీ, జనవరి 6 :**

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ మరోసారి ఆసుపత్రిలో చేరారు. తీవ్రమైన దగ్గు తో ఢిల్లీ లోని సర్ గంగా రామ్ హాస్పిటల్ లో అడ్మిట్ అయినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. సోనియా ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఛాతీ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీ నగరంలో తీవ్ర కాలుష్యం కారణంగా సోనియా అనారోగ్యానికి గురైనట్లు తెలిపాయి. సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో అడ్మిట్ అయినట్లు వెల్లడించాయి.

## మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలు భర్తీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**జయభేరి, హైదరాబాద్ జనవరి 6 :**

సింగరేణి కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి ఆసుపత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలు భర్తీ చేస్తామని అన్నారు. మంగళవారం శాసనసభలో భట్టి కీలక ప్రకటన చేశారు. సింగరేణిపై అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. కార్మికుల భద్రతకు భరోసాగా రూ. కోటి ప్రమాద బీమా కల్పిస్తున్నామని, సింగరేణితో పాటు విద్యుత్ ఉద్యోగులకూ వర్తిస్తుందని సూచించారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ లాబ్ ప్రారంభిస్తామని తెలియజేశారు. 32 మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చామని.. త్వరలో భర్తీ చేస్తామని అన్నారు. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతోందని, రామగుండంలో క్యాత్ ల్యాబ్ నిర్మాణం పిపిపి మోడల్ లో చేపడుతున్నామని అన్నారు. త్వరలో ప్రభుత్వ ఉద్యోగులందరికి రూ. కోటి బీమా అందిస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

▸▸ మొదటిపేజీ తరువాయి

## ముందుగా వాళ్లకే..

దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఆర్థిక శాఖ ప్రణాళికల మేరకు ముందుగా దివ్యాంగులకు పెంపు అమలు చేసి, ఆ తర్వాత దశలవారీగా మిగిలిన వర్గాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పింఛన్లతో పాటు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే అంశంపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

**44 లక్షల మంది:**

హైదరాబాద్ మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 44 లక్షల మంది వివిధ వర్గాల ప్రజలు ఆసరా పింఛన్లను పొందుతున్నారని గుర్తు చేశారు. పింఛన్లతో పాటు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే అంశంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో చర్చించామని, త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

**మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం..**

విద్యా రంగంలోనూ కీలక మార్పులు రానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంధులు, బధిర విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఇప్పటివరకు పదో తరగతి వరకే పరిమితమైన బ్రెయిలీ లిపి పుస్తకాలను ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయి వరకు విస్తరించనున్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా దాదాపు 8 వేల మందికి ఉచితంగా సహాయక పరికరాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. అంతే కాకుండా, దివ్యాంగ జంటల వివాహాలకు కళ్యాణలక్ష్మి పథకంతో పాటు అదనంగా మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొత్తగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు గ్రామ సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ చర్యలు అమల్లోకి వస్తే రాష్ట్రంలోని లక్షలాది దివ్యాంగ కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద ఊరట లభించనుందని ప్రభుత్వం భావిస్తోంది.

## కవిత ఇంటికి క్యూ..

కుల సంఘాల నేతలు, ఉద్యమ కార్యకర్తలు భారీగా హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని ఆమె నివాసం వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా కవిత తన ఇంటి బాల్కనీలో నిలబడి అందరికీ చేతులు జోడించి అభివాదం చేశారు. తర్వాత కిందకు వచ్చి ప్రతి ఒక్కరినీ పలకరించారు. "ఎలా ఉన్నారు? ఇంట్లో అందరూ బాగున్నారా?" అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తన వెన్నంటి ఉండి, ఇప్పుడు కష్టకాలంలో కూడా మద్దతుగా నిలిచిన ఉద్యమకారులను చూసి కవిత భావోద్వేగానికి లోనయ్యారు. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె గొంతు కంపిస్తూ "మీరు లేకపోతే నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. మీరు నా బలం" అంటూ మాట్లాడారు. ఈ సందర్భంలో అక్కడి పరిసర ప్రాంతాలు నినాదాలతో మారుమోగాయి. "జై తెలంగాణ... కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి... తెలంగాణ జాగృతి జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. "ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కవితకు అండగా ఉంటాం. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల కోసం పనిచేస్తాం" అని నినదించారు. మరోవైపు, రాజకీయ శక్తిగా అవతరించబోతున్నామంటూ కవిత చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమయింది. కవిత రాజకీయ పార్టీని ప్రకటిస్తే... రాష్ట్ర రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కవిత కాంగ్రెస్ లో చేరుతుంది...**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని అనుకోలేదని, కానీ వారు వచ్చారని చెప్పారు. కవిత కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. పార్టీ పెద్దలు తన విషయంలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంతవరకు మంత్రి పదవి ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రంగారెడ్డి జిల్లా పేరు మారుస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మల్‌రెడ్డి స్పందిస్తూ, పేరు మార్పు తనకు ఇష్టం లేదని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చని, జిల్లా పేరు మాత్రం మార్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ ఊపందుకుందని, భూముల ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో ఎవరూ అమ్ముకోవడానికి ఆసక్తి చూపడం లేదని ఆయన తెలిపారు.

## ఫిబ్రవరి 1న ప్రవేశపెడతారా..?

వారాంతంలో బడ్జెట్ కొత్తేమీ కాదు

బడ్జెట్‌ను వారాంతంలో ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇలాంటి సందర్భాలు ఉన్నాయి. 2025లో బడ్జెట్‌ను శనివారం నాడు ప్రవేశపెట్టారు. అంతకుముందు దివంగత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2015 ఫిబ్రవరి 28 శనివారం, 2016 ఫిబ్రవరి 28 ఆదివారం, తేదీల్లో బడ్జెట్‌ను సమర్పించారు. పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం నాడు కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సరైన సమయంలో తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

**ఫిబ్రవరి 1 తేదీ ఎందుకంత ముఖ్యం?**

2017కు ముందు కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి పనిదినాన ప్రవేశపెట్టేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1, ప్రారంభమైన తర్వాత కూడా కొన్ని నెలల పాటు బడ్జెట్ ఆమోదం పొందక పోయేది. ఈ సమయంలో ప్రభుత్వ ఖర్చుల కోసం పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్' ను ఆమోదించాల్సి వచ్చేది. ఈ జాప్యాన్ని నివారించడానికి 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది. గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలు కూడా ఉన్నాయి. కోవిడ్19 సమయంలో,అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012లో ఆదివారం నాడు సభ జరిగింది. ఈ నేపథ్యంలో 2026 బడ్జెట్ తేదీపై ప్రభుత్వం సంప్రదాయం, సౌలభ్యం మధ్య సమన్వయం సాధిస్తూ త్వరలోనే తుది నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

## మేకిన్ ఇండియాకు బూస్ట్

ఆర్టిలరీ రక్షణ వ్యవస్థలతో పాటు, వాయుసేన మరియు నౌకాదళాలకు అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తాయి. ఇవి అంతర్గతంగా తయారవుతుండటం వల్ల ఆర్థిక ప్రయోజనాలు మరియు స్వావలంబన పెరుగుతాయి. భవిష్యత్ దాడులకు సిద్ధంగా ఉండటమే లక్ష్యం.ఈ బడ్జెట్ స్వదేశీత్వాన్ని ప్రోత్సహిస్తూ, ఉద్యోగాలు సృష్టిస్తుంది. సాంకేతిక ఆవిష్కరణలను వేగవంతం చేస్తుంది. ఎస్-400 వంటి విదేశీ వ్యవస్థల ఆధారపడటాన్ని తగ్గించి, ఖర్చు తక్కువ దేశీ ఆప్షన్లపై ఆధారపడటం వ్యూహాత్మకంగా గొప్ప నిర్ణయం. దీర్ఘకాలంలో ఇది భారత డిఫెన్స్ స్వావలంబనకు మైలురాయిగా నిలుస్తుంది.

## నాచారంలో సే నో టూ డ్రగ్స్ ర్యాలీ

జయభేరి, ఉప్పల్ :

నాచారం, హెచ్ఎంటి నగర్ డెవలప్మెంట్ ఫోరం, నాచారం యాంటీ డ్రగ్స్ ఫోరం, ఎస్ఎస్ ఎస్ యువసేన వ్యవస్థాపకుడు మామిడాల సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో సే నో టూ డ్రగ్స్ అనే నినాదంతో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నాచారం చౌరస్తా నుంచి హెచ్ఎంటి నగర్ లోని జీహెచ్ఎంసి పార్కు వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ర్యాలీకి తెలంగాణ ఈగల్ ఫోర్స్ డిఎస్పి కే. సైదులు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు మత్తుపదార్థాల పట్ల అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాల బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. తమ చుట్టు ప్రాంతాలలో ఎవరైనా డ్రగ్స్ క్రయవిక్రయాలు జరిపినట్లైతే 1908 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

# తెగని నీటి పంచాయితీలు

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఇప్పటికే పదేళ్లు దాటుతున్నా, నదీ జలాల వివాదాలు మాత్రం ఇంకా తీరని సమస్యగానే కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన జరిగి మరో ఆరు నెలల్లో పన్నెండేళ్లు పూర్తవుతున్నా, నీటి పంచాయతీలు మాత్రం కొత్త కొత్త మలుపులు తిరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా గోదావరి , కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ మధ్య పోరు తీవ్రంగా సాగుతోంది. ఈ వివాదాలు కేవలం సాంకేతిక అంశాలకే పరిమితం కాకుండా, రాజకీయ సెంటిమెంట్‌గా మారడంతో పరిష్కారం మరింత క్లిష్టంగా తయారైంది.**



రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాలు కొత్త నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాయి. పెరుగుతున్న జనాభా, సాగునీటి అవసరాలు, తాగునీటి డిమాండ్, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ కలిసి కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి దారితీస్తున్నాయి. అయితే కొత్త ప్రాజెక్టులు కట్టాలంటే నికర జలాలు ఎంత, మిగులు జలాలు ఎంత, సముద్రంలో వృథాగా కలిసే నీరు ఎంత అన్నది స్పష్టంగా తేలాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కుదిరిన వాటా నిష్పత్తులను పక్కనపెట్టి తెలంగాణ తనకు ఎక్కువ వాటా కావాలని కోరుతుండగా, గతంలో నిర్ణయించిన విధంగానే నీటి పంపిణీ జరగాలని ఏపీ వాదిస్తోంది.ఏపీ వాదన ప్రకారం, దిగువ రాష్ట్రంగా ఉన్న కారణంగా సముద్రంలో కలిసే వృథా నీటిని వినియోగించుకునే హక్కు తమకుందని చెబుతోంది. అదే ఆధారంగా బనకచర్ల వంటి కొత్త ప్రాజెక్టులను నిర్మించాలని భావిస్తోంది. కానీ తెలంగాణ మాత్రం దీనిని పూర్తిగా తిరస్కరిస్తోంది.

తమ రాష్ట్రంలో కూడా ప్రాజెక్టులు నిర్మిస్తే మిగులు నీరు ఎంత ఉందో తేలుతుందని, సముద్రంలో కలిసే నీటిలో కూడా తమ వాటా ఉందని తెలంగాణ అభిప్రాయం.కృష్ణా జలాల విషయానికి వస్తే విభజన తర్వాత ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం వాటా కేటాయించారు. అయితే తెలంగాణ దీనిని అంగీకరించకుండా 5050 శాతం పంపిణీ కావాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు శ్రీశైలం , నాగార్జున సాగర్ వంటి ఉమ్మడి ప్రాజెక్టుల్లో నీటి వినియోగంపై స్పష్టమైన నియమాలు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని ఎక్కువగా వినియోగించడం వల్ల ఏపీలో సాగునీటి అవసరాలు దెబ్బతింటున్నాయని ఆరోపణలు ఉన్నాయి.గోదావరి జలాల విషయంలో ఏపీకి 65 శాతం, తెలంగాణకు 35 శాతం వాటాలు నిర్ణయించారు. పోలవరం కారణంగా ముంపు ప్రాంతాలు పెరుగుతాయని తెలంగాణ అభ్యంతరం తెలుపుతుండగా, ఇది జాతీయ ప్రాజెక్ట్ అని కేంద్రం (ద్వారా నిర్మాణం జరుగుతోందని ఏపీ సమాధానం ఇస్తోంది. బనకచర్ల ప్రాజెక్ట్‌ను నల్లమల సాగర్ గా పేరు మార్చి కొత్త డీపీఆర్ పంపినా, దానిపైనా అభ్యంతరాలు కొనసాగుతున్నాయి.ఈ వివాదాల మధ్య కోర్టు కేసులు, గ్రీన్ ట్రిబ్యునల్) స్టేలు కారణంగా ప్రాజెక్టులు నిలిచిపోతున్నాయి. అంచనా వ్యయాలు పెరుగుతుండగా, రైతులు నీటి హక్కులు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో ఏర్పడిన ఈ కమిటీకి రెండు రాష్ట్రాల అధికారులు సభ్యులుగా ఉన్నారు.

సాధారణంగా ఏపీ అంటే గులాబీ పార్టీకి నచ్చదు. అలా నచ్చితే ఆ పార్టీకి సెంటిమెంట్ వర్కౌట్ కాదు. అదే సమయంలో టిడిపి అన్న ఆ పార్టీకి పడదు. పడితే మళ్లీ తెలంగాణలో టిడిపి బతికేస్తుంది. అందుకే ఏపీతోపాటు టిడిపిని విపరీతంగా ద్వేషిస్తుంటారు గులాబీ నేతలు. ఈ అంశంపై నైనా మాట్లాడాలి అంటే అది ముందుగా చంద్రబాబు గురించి అయి ఉంటుంది. అంతలా అక్కడ విద్వేషం రెచ్చగొడితే గాని పని జరగదు. అటువంటి గులాబీ పార్టీ ఇప్పుడు చంద్రబాబు సర్కార్ చెప్పింది కరెక్ట్ అని చెబుతోంది. ఏపీ ప్రభుత్వం చెప్పినదానితో ఏకీభవిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఏపీ ప్రస్తావన వచ్చింది. చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. రాయలసీమలో నిర్మించ తలపెట్టిన పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబుతో మాట్లాడి తానే నిలుపుదల చేయించానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఈ ప్రకటనపై మూడు పార్టీల నుంచి అభిప్రాయాలు వచ్చాయి.

ముందుగా ఏపీ ప్రభుత్వం ఇది తప్పు అని.. రేవంత్ రెడ్డి చెప్పిన దాంట్లో నిజం లేదని తేల్చేసింది. గులాబీ పార్టీ సైతం ఏపీ ప్రభుత్వం చెప్పిందే నిజం అని పేరు చేసింది. కానీ ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో చంద్రబాబు చీకటి ఒప్పందం అని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం గురించి ప్రధానంగా చర్చ నడుస్తోంది.

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుఅనేది శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా నది వరద నీటిని తరలించేందుకు నిర్మించ తలపెట్టినది. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని ప్రాజెక్టులకు మళ్ళించే ముఖ్యమైన నీటి నియంత్రణ వ్యవస్థ. అయితే జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఏ అనుమతులు తీసుకోలేదు. దీంతో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ తో పాటు కేంద్ర సంస్థల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో 2020లోనే పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జగన్ ఈ ప్రాజెక్టు ప్రతిపాదన చేసిన సమయంలోనే తెలంగాణలో అధికార పార్టీగా ఉన్న బిఆర్ఎస్, విపక్షంలో ఉన్న కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అప్పటి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశాయి. అయితే కేవలం రాజకీయ ప్రయోజనాలకు.. తెలంగాణలో తన మిత్రుడు కేసీఆర్ కు లబ్ధి చేకూర్చే విధంగా.. జగన్మోహన్ రెడ్డి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, చిత్తశుద్ధి లేకుండా ఈ పథకాన్ని ప్రారంభించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. 2020 తోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం అలానే ఉండిపోయింది.జగన్మోహన్ రెడ్డి హయాంలో ఆ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని చెప్పడం లేదు. అసలు జగన్ ప్రస్తావన తేవడం లేదు. దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు హరీష్ రావు. ఎక్కడ జగన్మోహన్ రెడ్డి హయాంలో నిలిచిపోయింది అని చెబితే తన మిత్రుడికి పొలిటికల్ డామేజ్ జరుగుతుంది. అన్నింటికీ మించి చంద్రబాబు ప్రస్తావన ఉండదు. అందుకే మధ్య మార్గంలో ఏపీ సర్కార్ అభిప్రాయంతో ఏకీభవిస్తోంది గులాబీ పార్టీ. అయితే అసలు చంద్రబాబుకు సంబంధం లేదు. జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నిలిపివేసిన ప్రాజెక్టు అది. కానీ అనవసరంగా చంద్రబాబు పేరు తీసుకొచ్చారు రేవంత్ రెడ్డి. తాను ఆపిన ప్రాజెక్టు నిర్మాణం శాపాన్ని చంద్రబాబు పై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. అసలు టిడిపి, చంద్రబాబు గాలిపడని గులాబీ పార్టీ సైతం జగన్కు నష్టం లేకుండా ఆయన పేరు ప్రస్తావించడం లేదు. ఇలా తెలుగు రాష్ట్రాల రాజకీయాలు అన్ని చంద్రబాబు చుట్టూనే తిరుగుతున్నాయి.ఈ కమిటీ నివేదిక ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న ఆశ ఉన్నా, రాజకీయ సెంటిమెంట్లు అడ్డంకిగా మారతాయా అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చ. ఏదేమైనా కేంద్ర జోక్యంతో అయినా ఈ జల జగడాలకు ముగింపు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## క్రమపద్ధతిలో చేస్తాం..

చేయడమే లక్ష్యంగా, భౌగోళిక పరిస్థితులు మరియు ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు ఉంటాయని వివరించారు. ముఖ్యంగా మండల కేంద్రాలకు దూరంగా ఉన్న గ్రామాలను సమీపంలోని మండలాల్లో కలపడం, అలాగే అవసరమైన చోట కొత్త రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయడం ద్వారా పాలనా యంత్రాంగాన్ని బలోపేతం చేస్తామన్నారు.ఈ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ అంతా పారదర్శకంగా జరుగుతుందని, ఎవరిపై కూడా ఏకపక్ష నిర్ణయాలు రుద్దబోమని పొంగులేటి హామీ ఇచ్చారు. అధికారుల నుంచి వచ్చిన క్షేత్రస్థాయి నివేదికలను పరిశీలించిన అనంతరం, వాటన్నింటినీ అసెంబ్లీలో చర్చకు పెడతామని తెలిపారు. అన్ని పార్టీల ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నోటిఫికేషన్ విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ నిర్ణయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట కొత్త మండలాలు మరియు రెవెన్యూ డివిజన్లను కూడా ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే కొన్ని డివిజన్లకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కేవలం అంకెలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, క్షేత్రస్థాయిలో సామాన్యుడికి పాలన అందేలా చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే కొన్ని రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై ప్రాథమిక కసరత్తు పూర్తయిందని, త్వరలోనే పూర్తిస్థాయిలో రాష్ట్రవ్యాప్త మార్పులు అమల్లోకి వస్తాయని ఆయన సభకు వివరించారు. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో తెలంగాణలో పాలనాపరమైన చిక్కులు తొలిగిపోయి, అభివృద్ధి వేగవంతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. బీఆర్ఎస్ నాయకులు తోకముడిచారు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ శాసనసభ్యులు తోక ముడిచారని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని చెప్పిన ప్రతిపక్షం అసెంబ్లీ నుంచి జారుకుందని ఆయన ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీరాలు పలికారని అన్నారు. సభాపతిని అవమానపరిచేలా వారు వ్యవహరించినందుకు వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.బీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు యక్ష ప్రశ్నలు వేశారని అన్నారు. కానీ ఇప్పుడు మాత్రం సభలో కనిపించడం లేదని విమర్శించారు. శాసనసభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ప్రతిపక్షానికి అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ బయట మాట్లాడటమేమిటని ఆయన ప్రశ్నించారు.

**సభా హక్కుల ఉల్లంఘన**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నదీ జలాలపై చర్చ సందర్భంగా సభను తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ సభా హక్కుల ఉల్లంఘన కింద ఫిర్యాదు చేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్, రాయలసీమ ఎత్తిపోతల పనుల నిలిపివేత, కృష్ణా జలాల్లో తాత్కాలిక ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుదోవ పట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.సభాపతి సూచన మేరకు ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతిరెడ్డికి నోటీసులు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు చేపట్టాలని కోరుతూ అసెంబ్లీ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కేపీ వివేకానంద్, కోవ లక్ష్మి తదితరులు ఉన్నారు.

**ఈవీ వాహనాలు వాడండి**

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కీలక సూచనలు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) వినియోగించాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏమైనా ప్రోత్సాహకాలు అందిస్తోందా అని ఆయన ప్రశ్నించారు. ఛార్జింగ్ స్టేషన్ల కొరత కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈవీల వినియోగం తక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు.తెలంగాణలో ప్రస్తుతం కేవలం 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయింపు వంటి ప్రోత్సహకాలను ప్రభుత్వం అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఈవీలను ఉపయోగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని బీజేపీకి చెందిన మరో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చాలంటే ఈవీల వినియోగం తప్పనిసరి అని ఆయన అన్నారు. ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించడానికి పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

## ఇవే అభివృద్ధి మంత్రం

పెట్టుబడులు వచ్చేలా చేయగలిగామని సీఎంతో చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2025లో రాష్ట్రం కోసం అందరూ అద్భుతంగా పని చేశారు. గత ప్రభుత్వ పాలనలో పోయిన బ్రాండ్ ఇమేజ్ రాష్ట్రానికి తిరిగి వచ్చి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. భారీ పరిశ్రమలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయి. గూగుల్, టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయి. ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలి."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**ప్రజలపై భారాన్ని తగ్గించగలిగాం... సంతోషంగా ఉంది: సీఎం చంద్రబాబు**

"విద్యుత్ రంగంలో అద్భుతంగా పనిచేశాం. 13 పైసలు విద్యుత్ ఛార్జీలు తగ్గించాం. రూ.4500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలని నిర్ణయించాం. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. 2029 నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 3.70కు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూడడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. విద్యుత్ రంగంలో మనం చేసిన కృషి వల్లే డేటా సెంటర్లు వచ్చాయి. విద్యుత్ రంగంతోపాటు... వివిధ రంగాల్లో పెట్టుబడులు బాగా వచ్చాయి. దావోస్ సదస్సుకు వెళ్లాం ఏపీ బ్రాండ్ ప్రమోట్ చేయగలిగాం... విదేశీ కంపెనీలను ఆకర్షించగలిగాం. ఏపీకి గూగుల్ ఏఐ డేటా సెంటర్ తీసుకురావడానికి లోకేష్ కృషి చేశారు. సక్సెస్ ఇచ్చే కిక్ అద్భుతంగా ఉంటుంది... ఆ కిక్ కోసం అందరూ పని చేయాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫలితాలు రావాలనే లక్ష్యంతో పని చేయాలి."అని సీఎం సూచించారు.

**ఐ ల్యాండ్ టూరిజం అభివృద్ధిపై ఫోకస్**

"సూర్యలంక అత్యంత సురక్షితమైన బీచ్ ప్రాంతం. బీచ్ టూరిజంపై మాస్టర్ ప్లాన్ తయారు చేయండి. సూర్యలంక బీచ్ రిసార్ట్స్ బ్రాండింగ్ చేయండి. సూర్యలంక బీచ్ ఫ్రంట్ అభివృద్ధి చేయాలి. 15 కిలోమీటర్ల మేర క్లీన్ బీచ్ ఫ్రంట్ ఉండాలి. కాలుష్య రహిత ప్రాంతంగా సూర్యలంక బీచ్ ఫ్రంట్ ఉండాలి. సూర్యలంకతో పాటు సూళ్లూరు పేట వద్ద ఉన్న చిన్ని చిన్న ద్వీపాలను కూడా బీచ్ టూరిజం కింద అభివృద్ధి చేయవచ్చు. మాల్దీవ్స్ తరహాలో ఐ ల్యాండ్ టూరిజం తయారు చేసుకోవాలి. 25 వేల గదులు నిర్మించగలిగితే పర్యాటకుల్ని ఆకర్షించవచ్చు. టూరిజం కార్పోరేషన్ మరింత బలోపేతం కావాలి. సూర్యలంక ఏపీటీడీసీ రేటింగ్ పెరగాల్సిన అవసరం ఉంది. రాబోయే 15 ఏళ్లలో వెయ్యి కోట్ల ఆదాయం టూరిజం కార్పోరేషన్ కు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. పాపికొండలుపోలవరం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశంపై దృష్టి పెట్టండి. కోనసీమ, పులికాట్ , విశాఖ క్లస్టర్లు అత్యద్భుత పర్యాటక క్లస్టర్లుగా తయారవుతాయి. అనంతపురం నుంచి గండికోట వరకూ టూరిజం క్లస్టర్లలో కూడా పర్యాటకానికి అవకాశం ఉంది. తిమ్మమ్మ మర్రిమాను అతిపెద్ద మర్రిచెట్టు.. గూగుల్ మ్యాపింగ్ చేయండి. ఈ చెట్టుకు 2 వేల ఏళ్ల చరిత్ర ఉంది. ఆవకాయ్ ఫెస్టివల్, ఫ్లెమింగో ఫెస్టివల్, గండికోట ఉత్సవాలు, విశాఖ అరకు ఉత్సవ్, సీ టూ స్కై, ఏపీ ట్రావెల్ మార్ట్ లను ఘనంగా నిర్వహించారు.

# 10వ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

- సిద్దిపేట జిల్లాలో 10వ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించేలా
- కార్యాచరణ బద్ధంగా పదో తరగతి విద్యార్థులచే ప్రత్యేకంగా చదివించాలని
- జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రభుత్వ విద్యాలయాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.




**జయభేరి, సిద్దిపేట :**

మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, వివిధ గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లతో పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల వారీగా గత సంవత్సరం పదవ తరగతిలో సాధించిన ఉత్తీర్ణత శాతం మరియు ఈసారి 100% ఉత్తీర్ణత సాధించడానికి తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. గత మూడు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉన్నత స్థానాలను సాధిస్తూ ఆదర్శంగా నిలిచిందని అదే మాదిరిగా ఈసారి కూడా 100% ఉత్తీంర్ణత సాధించేలా ప్రత్యేక కార్యచరణ ప్రకారం విద్యార్థులను చదివించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో నేటి నుండే ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు సాయంత్రం 4:30 గంటల నుండి 5:30 గంటల వరకు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులు వీక్ ఉన్న సబ్జెక్టులలో కచ్చితంగా ఉత్తీర్ణత అయ్యేలా ప్రత్యేకంగా తర్ఫీదు నివ్వాలని అన్నారు. విద్యార్థులచే బట్టి పట్టించడం కాకుండా సబ్జెక్ట్ అర్థమయ్యేలా బోధించాలని అన్నారు. పేరెంట్స్ మరియు సంక్షేమ హాస్టల్లో సంక్షేమ అధికారులతో సమావేశాలు నిర్వహించి కచ్చితంగా ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు పరీక్ష సమయంలో టెన్షన్ కు గురికాకుండా ముందుగా ట్రేస్ మేనేజ్మెంట్ పై తర్ఫీదు నివ్వాలని అన్నారు.

పిల్లలు చదువుతోపాటు వాళ్ళు చెప్పదలుచుకున్నది ధైర్యంగా చెప్పినప్పుడే పరీక్షలలో మరియు భవిష్యత్తులో కూడా రాణిస్తారు కాబట్టి ఆదిశగా వారిని మోటివేట్ చేయాలని అన్నారు. పదవ తరగతి చదువుతున్న ఇప్పటికీ సరిగా చదవడం రాయడం రాని విద్యార్థులు ఉండడం దురదృష్టకరమని ఇలాంటి పరిస్థితి రాకుండా ప్రాథమిక స్థాయి నుండే రాయడం చదవడం పై త్వరలోనే ప్రైమరీ స్కూల్స్ టీచర్లతో కూడా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానని అన్నారు. హైస్కూలలో కూడా అన్ని తరగతుల విద్యార్థులు సరిగా చదివేలా, రాసేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. అందరికీ సమాన విద్య అవకాశాలు లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆమెరకు ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను నెలకొల్పడం జరిగిందని, మంచి నైపుణ్యత గల ఉపాధ్యాయులు అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారని అన్నారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థుల అడ్మిషన్స్ చాలా తక్కువ ఉన్నాయని విద్యార్థుల అడ్మిషన్ పెరిగేలా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరగాలని అన్నారు.

అదేవిధంగా విద్యార్థులు ఆరోగ్యంగా పెరిగేలా ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, కేజీబీవీ లలో మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక అభ్యసన ప్రణాళిక బుక్లెట్లను ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి చెకుమకీ సైన్స్ సంబరాలు 2025 లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతులను పొందిన సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, అన్ని మండలాల ఎంఈఓ లు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ల డిసిఓ లు, ప్రిన్సిపాల్ లు విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ పాఠశాలలకు ఆటోలు, ప్రైవేటు, బస్సులు తర్వాత వచ్చే సమయంలో ఆయా వాహనాల డ్రైవర్ల కండిషన్లు లైసెన్సులు వాహన కండిషన్లు, వాహనం కాల పరిమితి అన్ని పరిశీలించాలని అన్నారు. ముఖ్యంగా అధిక లోడుతో ఆటోలలో విద్యార్థులను రవాణా చేయడం లంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆటోలో ఆరుగురికి మించి విద్యార్థులను తీసుకురాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, డిఇఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 6 :**




కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే మున్సిపల్ ఎన్నికల ప్రచారాస్త్రాలుగా సంధించాలని మాజీ ప్రభుత్వ విప్,మాజీ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సూచించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. రానున్న మున్సిపల్ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆమె అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది అన్నారు. అనేక హామీలను నెరవేర్చలేకపోయిందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ యాదగిరిగుట్టను తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ తిరుపతిగా అభివృద్ధి పరిచారని ఆమె గుర్తు చేశారు.

యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధికి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడిన విషయాలను ఈ సందర్భంగా గొంగిడి సునీతా ప్రస్తావించారు. ప్రజలలో కాంగ్రెస్ పట్ల విముఖత ఉందని ఆమె గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ముందుకు సాగాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా సూచించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని అన్ని వార్డులలో పార్టీపరంగా ఎంతోమంది టైట్ కోసం ఆశిస్తారని... అనేక మంది ఆశావహులు ఉంటారని... అయితే ఒక్కో వార్డులో ఒక్కరికే టైట్ వస్తుందని... మిగతావారు బిఆర్ఎస్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆమె ప్రత్యేకంగా కోరారు. అంతర్గత విభేదాలకు తావు ఇవ్వరాదని అన్నారు. అంకితభావంతో పనిచేసే నాయకులకు,కార్యకర్తలకు భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం మంచి గుర్తింపు ఇస్తుందని అవకాశాలు కల్పిస్తుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షు కర్రే వెంకటయ్య,బిఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్లనరహరి, నాయకులు ఆవుల సాయి, ముఖ్యర్ల సతీష్ యాదవ్, అనిల్, తాజా మాజీ కౌన్సిలర్ లతో సహా మున్సిపాలిటీలోని అన్ని వార్డుల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ


**జయభేరి, తుర్కపల్లి, జనవరి 06 :**



తుర్కపల్లి మండలం చొక్లా తండా, రాంపూర్ తండా గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేకలకు గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచులు భూక్య రాజారాం నాయక్, గుగులోతు బద్దు నాయక్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడం ద్వారా జీవాల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. దీనివల్ల గొర్రెలు ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు వాటి పెరుగుదల మెరుగవుతుందని అన్నారు. సంవత్సరానికి కనీసం మూడుసార్లు నట్టల నివారణ మందులను జీవులకు త్రాగించడం వలన బలంగా తయారవుతాయని, తద్వారా గొర్రెల పెంపకం దారులకు ఆర్థికంగా మంచి లాభాలు అందుతాయని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు సుమన్, కిషన్, పశువైద్య సిబ్బంది రాఘవేంద్ర, శంషాద్దీన్, పెండెం ప్రవీణ్, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

# స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లో నమోదైన వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాల వేలాన్ని, దేవరకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, ఎస్హెచ్ఓ కార్యాలయం వారు నిర్వహించనున్నారు.

ఈ వేలం కార్యక్రమం 08 జనవరి, 2026 నాడు, నల్గొండ సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో, ఎస్హెచ్ఓ, దేవరకొండ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించబడుతుంది. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు, 08.01.2026 న ఉదయం 10:00 గంటలకు దేవరకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లో తమ పేర్లను నమోదు చేసుకొని, రెండు చక్రాల వాహనాలకు రూ.10,000/, నాలుగు చక్రాల వాహనాలకు రూ.30,000/ భద్రతా డిపాజిట్ చెల్లించాలి. వేలంలో విజయం సాధించని బిడ్డర్లకు భద్రతా డిపాజిట్ మొత్తం అదే రోజున తిరిగి చెల్లించబడుతుంది. ఆసక్తి గల బిడ్డర్లు అధికారులచే నిర్దేశించబడిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించి, నిర్ణీత సమయం ప్రదేశంలో జరిగే వేలం ప్రక్రియలో పాల్గొనవలసిందిగా కోరడమైనది. వాహనాల జాబితా, నిబంధనలు షరతులు, నమోదు ప్రక్రియ తదితర వివరాల కోసం దేవరకొండ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించగలరు.



# మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి

- ఆర్టీసీ డిపోకు ఎలక్ట్రికల్ బస్సులు ఇవ్వాలి
- అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య విజ్ఞప్తి

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 06:**

శ్రీ లక్ష్మినరసింహ స్వామి దర్శనార్థం యాదగిరి కొండపైకి నడిపే ఆర్టీసీ బస్సులకు మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించే మహాలక్ష్మి పథకం అమలు కావడం లేదని,తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న విధంగా యాదగిరి కొండపైకి రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులలో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ యాదగిరిగుట్టకు వచ్చినప్పుడు దేవస్థానం ఈవో కూడా మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకురావడం జరిగిందన్నారు. ఈ విషయమై శాసనసభలో ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి డిమాండ్ పెరిగిందని.. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

**సెలవు దినాలలో ఆర్టీసీ బస్సులు నడపాలి..**

యాదగిరిగుట్ట ఆర్టిసి డిపోకు ఎలక్ట్రికల్ బస్సులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం నడిపే ఆర్టీసీ బస్సులు పాఠశాల సెలవు దినాలలో నడపటం లేదని.. ఫలితంగా ఆయా రోజులలో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. సెలవు దినాలలో కూడా యధావిధిగా అన్ని గ్రామాలకు బస్సులు నడపాలని ఆయన కోరారు.

# ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ గా యలమల గోపీచంద్

**జయభేరి, దేవరకొండ :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ స్టేట్ హాస్టల్స్ కోకన్వీనర్ యలమల గోపీచంద్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవరకొండ కి చెందిన యలమల శ్రీధర్ కుమారుడు గోపిచంద్ తెలంగాణ స్టేట్ హాస్టల్స్ కోకన్వీనర్ గా నియమితులయ్యారు. ఈనెల శంషాబాద్లో నిర్వహించిన ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభల సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీరు గతంలో దేవరకొండ నగరం కార్యదర్శిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టినట్టు వివరించారు. అనంతరం గోపీచంద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థ అయినటువంటి విద్యార్థి పరిషత్ దేశప్రేమను కేంద్రంగా ఉంచి, జాతి ప్రధమ అనే భావంతో పని చేసే సంస్థలో భాగమైనందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం మరియు విద్యారంగం, సంక్షేమ హాస్టల్స్ సమస్యలపై నిరంతరం పోరాడి సమస్యలు పరిష్కరించే విధంగా తన వంతు కృషిని అంకితభావంతో కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.



# ప్రతి ఒక్కరూ ముత్యాలమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, తీదేడు గ్రామ సర్పంచ్

**జయభేరి, చింతపల్లి :**

ప్రతి ఒక్కరు ముత్యాలమ్మ తల్లి అనుగ్రహం పొందాలని చింతపల్లి మండలం తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం,పునర్నిర్మాణం కోసం బిఆర్ఎస్ సర్కారు కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సందె మల్లమ్మ నీరంజన్,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,గ్రామ నాయకులు సిమర్ల శ్రీను యాదవ్,మోర కిరణ్,జూలురి శ్రీధర్,వీరమల్ల జగదీష్,సందె యేసు,వీరమల్ల వెంకటయ్య,ఉడుత వెంకటయ్య,సందె శంకర్,సందె శ్రీశైలం,ఆమనూరి కుమార్,సందె అనిల్,ఆమనూరి లింగస్వామి,వంకేశ్వరం సుధాకర్,సందె రామలింగం,గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బిసి కార్మిక విభాగం మున్సిపాలిటీ అధ్యక్షునిగా మాకం చంద్రమౌళి



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ కార్మిక విభాగం నూతన అధ్యక్షునిగా మాకం చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా పున్న బిక్షమయ్య ని ఎన్నుకున్నారు. ఈ మేరకు సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేసినారు వీరి పదవి కాలం రెండు సంవత్సరాలు కొనసాగుతుందని తెలిపారు ఎన్నికైనటువంటి అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో ఉంచినటువంటి బాధ్యతలను వమ్ము చేయకుండా కార్మికుల ఐక్యత కోసం సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తానని పట్టణంలో ఉన్నటువంటి అన్ని కార్మిక సంఘాలు ఐక్యం చేసి ఐక్య ఉద్యమాలకు బీసీలను చైతన్యం చేస్తామని తెలిపారు సహకరించిన చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కి కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

# నక్క అఖిలేష్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణానికి చెందిన ఎండి నిరంజన్ కు అనారోగ్య కారణాలు ఇబ్బంది పడుతున్న అతనికి కాళ్లు చేతులు పడిపోయినాయి తెలుసుకొని ఫౌండేషన్ అధ్యక్షులు నక్క వెంకటేష్ యాదవ్ కార్యదర్శి నక్క మహేష్ యాదవ్ అతనికి ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది వారు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేసినారు.

# పరమేశ్వర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఇర్షద్ ఖాన్



**జయభేరి, ఉప్పల్:**

నూతన సంవత్సర సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇర్షద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) వారితో పాటు మెసిన్, ఆసిఫ్, వాహిద్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.




## పంచాయతి సెక్రటరీకి సన్మానం

- పట్టభద్రుల కాంటెస్టెడ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ

**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లస్మన్నపల్లి గ్రామ పంచాయతీ సెక్రెటరీనీ సైదాపూర్ మండలం పర్యటనలో భాగంగా పట్టభద్రుల కాంటెస్టెడ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ సైదాపూర్ లో తన స్టూడెంట్ అయిన సెక్రటరీ రాజేందర్ గారిని శాలువాతో సన్మానించి పంచాయతీ సెక్రటరీల సమస్యల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది.



కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల పరిధిలో ఇన్స్పైర్ జూనియర్ కాలేజ్ 2026 క్యాలెండర్ పోస్టర్ను ఆవిష్కరించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ కంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ వారితోపాటు లెక్చరర్ వేముల శ్రీనివాస్, కాత శ్రీకాంత్, గాదె పాక కుమార్ రాజా, సైదాపూర్ మండలం సర్పంచ్ మునుగంటి స్వప్న సంతోష్, ఉప సర్పంచ్ గోపగాని నవీన్, పాలకవర్గం పాల్గొనడం జరిగింది.

**జయభేరి, సైదాపూర్**

## ఈ పంచాయతీ ఆపరేటర్ల సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ హరికృష్ణ



**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం పర్యటనలో భాగంగా పట్టభద్రుల కాంటెస్టెడ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ రాష్ట్రంలో ఈ పంచాయతీ ఉద్యోగుల భద్రత, బేసిక్ స్కేల్, రెగ్యులరైజేషన్ గురించి సైదాపూర్ మండల ఈ పంచాయతీ ఆపరేటర్ బర్మావత్ కుమార్, అనగోని శ్రీనివాస్, నూనె శ్రీనివాస్ తో పలు అంశాలపై చర్చించడం జరిగింది.

## నూతన సైదాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గాని కి సన్మానం

- డాక్టర్ ప్రసన్న హరి కృష్ణ



**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం పర్యటనలో భాగంగా పట్టభద్రుల కాంటెస్టెడ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మునిగంటి స్వప్న సంతోష్, ఉప సర్పంచ్ గోపగాని నవీన్ (సైదాపూర్ మండలం ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు) వార్డ్ మెంబర్లను శాలువాతో సన్మానించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న హరి కృష్ణ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందుతే దేశ అభివృద్ధికి అవకాశం ఉంటుందని భవిష్యత్తులో యువత మహిళలు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు .రాబోతున్న ఎంపీటీసీ జెడ్పిటిసి స్థానాలలో విజయం సాధించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీం పిహెచ్కే సభ్యులు వేముల శ్రీనివాస్, ఖాతా శ్రీకాంత్, గాదపాక కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలలు



**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలో గెలుపొందిన మహిళలకు మండల స్థాయిలో గెలిచిన మహిళలు హుస్నాబాద్ నియోజక వర్గ స్థాయిలో జరిగే ముగ్గుల పోటీలో పాల్గొనాలని ఏపీఎం తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో MAO వైదేహి, MPO బసరుద్దీన్, AMC దొంత సుధాకర్, MEO రవీందర్ చారి మహిళలుపాల్గొన్నారు. 1) బైర రేణు శ్రీ, వెనకేపల్లి. 2) మేడ వేణి పావని, వెనకేపల్లి. 3) కొమ్ములసరిత, దుద్దెనపల్లి. 4) ఈరాల, మమత, వెనకేపల్లి. 5) కామని స్రవంతి, ఆరేపల్లి మండలంలోని ముగ్గుల పోటీలో పాల్గొన్నవారు. 90 మందిలో ఐదుగురిని సెలక్షన్ చేశారు.

# దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**జయభేరి, కరీంనగర్ :**



**నవ భారతాన్ని నిర్మించే శిల్పులు శిశుమందిర్ గురువులు నేను ఇదే స్కూల్లో రేకుల షెడ్డు కింద చదువుకున్నా.. సంస్కారం + సైన్స్+స్పోర్ట్స్ = శిశుమందిర్ సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి శిశు మందిర్ లోనే నేర్చుకున్నా.. నా పార్లమెంట్ పరిధిలోని శిశు మందిర్ లకు పక్కా భవనాలు నిర్మిస్తా.. నా పార్లమెంట్ పరిధిలోని శిశు మందిర్ లకు పక్కా భవనాలు నిర్మిస్తా.. శిశు మందిర్ లోని 9, 10వ తరగతి విద్యార్థులందరికీ సైకిళ్లు ఇస్తున్నా ల్యాప్ టాప్ లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తా.. శిశు మందిర్ లో చదువుకోవడం నా అదృష్టం చదువుకోలేక పోవడం నా పిల్లల దురదృష్టం. పాలకుల నిర్లక్ష్యంవల్ల పాఠశాలల్లో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోంది.**

కనీస సౌకర్యాల్లేక అల్లాడుతున్నాయి. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఊసే లేదు, యువతకు స్కూటీ హామీ జాడే లేదు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ వారీగా డబ్బులిస్తామని ఆశ చూపారు. సర్కార్ హామీలు, నిధులపై ఆధారపడకుండా పిల్లల భవిష్యత్తుకు పాటుపడుతున్న సంస్థ శిశు మందిర్. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్ సరస్వతి శిశు మందిర్ లో క్రీడా జ్యోతిని వెలిగించి ఖేల్ ఖుద్ కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి సంజయ్. పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడిన కేంద్ర మంత్రి. దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నవ భారతాన్ని నిర్మాణానికి కృషి చేసే శిల్పులు శిశుమందిర్ గురువుల ని కొనియాడారు. ఇంత గొప్ప స్కూల్ లో చదువుకోవడం గర్వంగా ఉందన్నారు. సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, ధర్మం వంటి అంశాలు శిశు మందిర్ లోనే నేర్చుకున్నానని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలన్నింటికీ పక్కా భవనాలు నిర్మించడంతోపాటు ల్యాప్ టాప్ సహా ఇతర సౌకర్యాలన్నీ కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ లోని హౌజింగ్ బోర్డు కాలనీలోని సరస్వతి శిశు మందిర్ లో రెండు రోజుల పాటు నిర్వహించే ఆటల పోటీల ఖేల్ ఖుద్, ప్రారంభ కార్యక్రమానికి బండి సంజయ్ విచ్చేశారు. అఖండ జ్యోతి వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడారు. టీచర్లతో కలిసి ఫోటోలు దిగారు. అంతకుముందు పిల్లలను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడారు.

సరస్వతి శిశు మందిర్ మీ స్కూలా? నా స్కూలా,ఇది మన స్కూల్. ఈ శిశు మందిర్ లో చదువుతోపాటు సంస్కారం కూడా నేర్పుతారు. శిశు మందిర్ అంటే ఒక బిల్డింగ్ గురించి కాదు,హంగు అర్భాటం కాదు దేశ భవిష్యత్తును మౌనంగా నిర్మిస్తున్న కర్మాగారం. మానవీయ విలువలను పెంపొదిస్తూ దేశ భవిష్యత్ కోసం నవ తరాన్ని తయారు చేయడంలో సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇందులో చదువుకోవడం మన అదృష్టం. శిశుమందిర్ లో చదువుకున్న ఎంతో మంది అధికారులు అయ్యారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగులు అయ్యారు. రాజకీయ నేతలయ్యారు. శిశు మందిర్ లో చదువుకోవడంవల్లే నేను ఈ స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేయగలుగుతున్నా. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఆర్మీలో చేరి దేశానికి సేవ చేసేలా కృషి చేయాలని కోరుతున్నా... కార్పొరేట్ విద్యా సంస్థలు వచ్చాక డబ్బు సంపాదనలో పడి విద్య అనే పదాన్ని పూర్తిగా మార్చేశాయి. చదువు అంటే ర్యాంకులు, మార్కులు, ప్యాకేజీలు, ఫారిన్ కోసమే అన్నట్లుగా తయారైంది. శిశు మందిర్ వ్యాపారం చేయదు. సరస్వతి శిశుమందిర్ అంటే ప్రభుత్వ పాఠశాల కాదు. ప్రైవేట్ పాఠశాల అసలే కాదు. ప్రజల మనసుల్లో నడిచే విద్యా ఉద్యమం. ఇది లాభం కోసమో, ఫలితాల కోసం నడిపే సంస్థ కాదు ఒక లక్ష్యం కోసం నడిచే సంస్థ. భవిష్యత్తు కోసం పని చేసే సంస్థ. అణువణువూ దేశభక్తిని బోధించే సంస్థ. మార్కులు మనిషిని తయారు చేస్తాయా? ర్యాంకులు విలువలను నేర్పుతాయా, ప్యాకేజీలు దేశభక్తిని పెంచుతాయా? అసలు మన భారతదేశానికి ఎట్లాంటి విద్య కావాలి? మార్కులు, ర్యాంకులే కాదు దేశభక్తిని, సంపూర్ణ మనిషిని నిర్మించే విద్య కావాలి. అది సరస్వతి శిశు మందిర్ లోనే దొరుకుతుంది.

ఉదయం ప్రార్థన, వందే మాతరం, భారత మాత చిత్రానికి నమస్కారం వంటి కార్యక్రమాలతో పిల్లల రక్తంలో విలువలను నేర్పుతారు. పిల్లలకు రామాయణం, మహా భారతం గొప్పతనాన్ని, అందులోని విలువలను నేర్పుతారు. గీతా సారాన్ని అర్థమయ్యేలా చెబుతారు. అదే సమయంలో మ్యాథ్స్, సైన్స్, టెక్నాలజీ విద్యను బోధిస్తారు. అందుకే సంస్కారం + సైన్స్+ స్పోర్ట్స్= శిశుమందిర్ విద్య అవుతుంది. సరస్వతి శిశుమందిర్ లో గురువు అంటే జీతం చూసే ఉద్యోగి కాదు, టైమ్ చూసే క్లర్క్ కాదు ఒక సాధకుడు. వీళ్లకు పెద్ద జీతాలు లేవు. పెద్ద పెద్ద వ్యాపార ప్రకటనలు ఉండవు. కానీ పెద్ద బాధ్యత ఉంది. దేశ భవిష్యత్తు భుజాల మీద వేసుకుంటారు. దేశాన్ని నిర్మించే అసలైన శిల్పులు శిశు మందిర్ గురువులు. విద్యతో సంపాదన రావచ్చు. కానీ విద్యతో సంస్కారం రాకపోతే ఆ సంపాదన కుటుంబానికి, సమాజానికి భారమే. ఇది గమనించే సరస్వతి శిశుమందిర్ పిల్లలను ఉద్యోగార్థులుగా కాదు, దేశ సేవకులుగా తయారు చేస్తుంది. ఇక్కడి విద్యార్థి తన గురించి మాత్రమే కాదు, సమాజం గురించి ఆలోచిస్తాడు. ఇదే నిజమైన విద్య. సరస్వతి శిశుమందిర్ అంటే ఒక భవనం కాదు, ఒక బ్లాక్ బోర్డు కాదు,ఒక సంకల్పం, ఒక సంస్కార దీపం. భారత మాత సేవ. సరస్వతి శిశుమందిర్ పిల్లలకు విద్య ఇస్తుంది కాదు. దేశానికి దిశ చూపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా వ్యవస్థను కాంగ్రెస్ పాలకులు నిర్వీర్యం చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు ఇస్తామని మోసం చేశారు. గత నాలుగేళ్లుగా దాదాపు రూ.10 వేల కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను, యాజమాన్యాలను ఇబ్బంది పెడుతున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తామన్నారు. ఆ ఊసే లేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు టెన్త్ పాసైతే రూ.10 వేలు, ఇంటర్ పాసైతే 15 వేలు, డిగ్రీ చేస్తే 25 వేలు, పీజీ చేస్తే లక్ష రూపాయలు ఇస్తామన్నారు. నయాపైసా ఇయ్యలేదు. ఆఖరికి తమ జీవితం మొత్తాన్ని స్కూల్ కు, ప్రభుత్వానికి అంకితం చేసిన రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ఇవ్వాలని అడిగిన పాపానికి కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అరెస్ట్ చేసి ఇబ్బంది పెడుతుంది. ప్రభుత్వం మీద ఆధార పడకుండా విద్యను బోధిస్తున్న సంస్థ శిశు మందిర్. నేను ఈ స్కూల్ లోనే చదువుకుని ఇంత వాడినయ్యానని కాలర్ ఎగరేసి చెప్పగలను. విద్య, సభ్యత, సంస్కారం, దేశభక్తి కూడా ఇక్కడే నేర్చుకున్నా. ధర్మ రక్షణ కోసం ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు వెళుతున్న. శిశు మందిర్ విద్యార్థులంతా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి భవిష్యత్తును నిర్మించు కోవాలని కోరుతున్నా శిశు మందిర్ లను ఆదరించండి ప్రోత్సహించండి.



## రాష్ట్ర కో కన్వీనర్ గా ఉప్పు సాయికిరణ్ నియామకం

**జయభేరి, తుర్కపల్లి, జనవరి 06 :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ 44వ రాష్ట్ర మహాసభలు ఈనెల 3 నుండి 5వ తేదీ వరకు శంషాబాద్ లో నిర్వహించారు .ఈ మహాసభలో స్టూడెంట్ ఫర్ సేవా ఎస్ ఎఫ్ ఎస్ తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ గా తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన ఉప్పు సాయికిరణ్ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అన్నారు.

## ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు

**జయభేరి, మేడిపల్లి :**

నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్ సందర్భంగా మంగళవారం ఉదయం 11:00 గంటలకు మేడిపల్లి పోలీస్ వారు ఉప్పల్ డిపో సమీపంలో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించడమైనది. ఈ వాహన తనిఖీలలో భాగంగా, హెల్మెట్ / హెడ్‌గియర్ ధరించని ద్విచక్ర వాహనదారులపై 16 ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడం జరిగింది. అదేవిధంగా, రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించడం కూడా జరిగిందని తెలియజేయడమైనది. ప్రజల ప్రాణ భద్రతల దృష్ట్యా, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని మేడిపల్లి పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జర్నలిస్టుల జోలికి వస్తే ఊరుకోం

- సంఘాలు కాదు జర్నలిస్టుల సంక్షేమమే మాకు ముఖ్యం
- జర్నలిస్టులను వేరు చేసి చూడడం తగదు
- చిన్న పత్రికలకు, డిజిటల్ మీడియాకు అక్రిడేషన్ ఇవ్వాలి
- జీవో 252 ని పునఃసమీక్షించాలి.. సుందర్ కల్లూరి

**జయభేరి, హైదరాబాద్, జనవరి 6 :**



తెలంగాణలోని ప్రతీ జర్నలిస్ట్ కి న్యాయం జరగాలని రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు, చిన్న పత్రికలు, డిజిటల్ మీడియా అంటూ వేరు చేయడం తగదని, జీవో 252 ని పునః సమీక్షించాలని, అర్హులైన ప్రతీ జర్నలిస్ట్ కి అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలన్నీ జర్నలిస్టులకు అందాలని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి డిమాండ్ చేసారు. తెలంగాణ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్నటువంటి జర్నలిస్ట్ ల జోలికి వస్తే మాత్రం ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. మీకు జరిగిన ఇబ్బంది మా దృష్టికి తీసుకొస్తే, తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం మీ దగ్గరికి వచ్చి మీకు కొండంత అండగా ఉంటుందని జర్నలిస్టులందరికీ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి, తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కీర్తీ సంతోష్ రాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సాయి గౌడ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు.. ట్రాఫిక్ నియంత్రణ.. శబ్ద కాలుష్య నియంత్రణపై అవగాహన

**జయభేరి, మేడిపల్లి :**




మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫంక్షన్ హాల్స్, బ్యాంక్వెట్ హాల్స్, డీజే సౌండ్ నిర్వాహకులతో మంగళవారం సాయంత్రం 05:00 గంటలకు సమన్వయ సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్య నియంత్రణ అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించడమే. ఈ సందర్భంగా హాల్ నిర్వాహకులకు హాల్ ప్రాంగణంలో సక్రమమైన ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, తద్వారా ట్రాఫిక్ సమస్యలు, గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించడమైనది. అదేవిధంగా, రాత్రి 10:00 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ డీజే సౌండ్ లేదా అధిక శబ్దం ఉండకూడదని, శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించడమైనది. ఏదైనా మీటింగ్, ఫంక్షన్ లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందుగానే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే పోలీస్ అనుమతులు పొందాలని నిర్వాహకులకు తెలియజేయడమైనది. అలాగే, భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్ కెమెరాల వినియోగానికి ముందుగా పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరి అని, అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా హెచ్చరించడమైనది. ఈ సమావేశంలో ప్రజల భద్రత, శాంతియుత వాతావరణం, చట్ట నిబంధనల అమలు విషయంలో హాల్ నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరడమైనది. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసౌకర్యాలు లేదా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలియజేయడమైనది.



## వరలక్ష్మి శరత్ కుమార్, పూజా శరత్ కుమార్, దోస డైరీస్ ప్రొడక్షన్ నంబర్ 1 'సరస్వతి'

వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం 'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్ ప్రేక్షకులలో క్యురియాసిటీ పెంచింది.తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రంతో తొలిసారిగా దర్శకురాలిగా మారిన వరలక్ష్మి శరత్ కుమార్, తానే ప్రధాన పాత్రలో నటిస్తూ పక్కా ప్లానింగ్, క్లియర్ విజన్‌తో అనుకున్న సమయానికి షూటింగ్‌ను పూర్తిచేశారు. ఫైనల్ అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. 'సరస్వతి' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది.ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. సరస్వతి చిత్ర షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాం. ఈ ప్రయాణంలో నాకు పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్క ఆర్టిస్ట్‌కు, టెక్నీషియన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్‌ను ప్రారంభించబోతున్నాం.ఈ చిత్రంలో జీవా, ప్రకాష్‌రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. సంగీత సంచలనం థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, ఎ.ఎం. ఎడ్విన్ సకే కెమెరా మ్యాన్. వెంకట్ ఎడిటర్, సుధీర్ ఆర్ట్ డైరెక్టర్. ప్రవీణ్ డేనియల్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. తారాగణం: వరలక్ష్మి శరత్‌కుమార్, జీవా, ప్రకాష్‌రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక, కిషోర్ కుమార్, శ్రీకాంత్ అయ్యర్, రావు రమేష్, సప్తగిరి, మైమ్ గోపి, హరేష్ పరేడే, తులసి, రఘు బాబు, దేవీ ప్రసాద్, వెంకట్.

## మనం సెంటిమెంట్ రిపీట్?



అగ్ర నటుడు నాగార్జున ప్రస్తుతం వందో చిత్రంలో నటిస్తున్నారు. సుదీర్ఘ కెరీర్‌లో కథల పరంగా ప్రయోగాలు, అపూర్వ విజయాలతో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సృష్టించుకున్నారాయన. ఈ నేపథ్యంలో ఆయన 100వ సినిమా అప్‌డేట్స్ గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్నది. తాజా సమచారం ప్రకారం ఈ చిత్రాన్ని నాగార్జునకు బాగా కలిసొచ్చిన మే 23వ తేదీన విడుదల చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. ఆ డేట్ నాగార్జునకు సెంటిమెంట్ అని చెబుతారు. తొలి చిత్రం 'విక్రమ్'తో పాటు అక్కినేని మూడు తరాలు కలిసి నటించిన 'మనం' చిత్రాలు మే 23న విడుదలయ్యాయి. తన వందో సినిమా రిలీజ్ విషయంలో కూడా నాగార్జున అదే సెంటిమెంట్‌ను రిపీట్ చేయబోతున్నారని ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రానికి '100నాటౌట్' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి.



## వారంపాటు షూటింగ్ కూడా చేశా కానీ..

ఏజెంట్, గాండీవధారి అర్జున సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది సాక్షి వైద్య. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశనే మిగిల్చాయి. సాక్షి వైద్య ఇక ఎలాగైనా హిట్టు కొట్టాలని ఈ సారి శర్వానంద్‌తో కలిసి నారి నారి నడుమ మురారి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ మూవీ జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది సాక్షి వైద్య. ఈ భామ ముందుగా పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో పోషిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో అవకాశం కొట్టేసిన విషయం తెలిసిందే. అయితే అనుకోకుండా ఈ ఛాన్స్ రాశీఖన్నా చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇదే విషయంపై సాక్షి వైద్య మాట్లాడుతూ.. ఉస్తాద్ భగత్ సింగ్ కోసం వారంపాటు షూటింగ్‌లో కూడా పాల్గొన్నా. కానీ ముందుగా తీసుకున్న కమిట్‌మెంట్స్, డేట్ల సర్దుబాటు కారణంగా అనుకోకుండా పవన్ కల్యాణ్‌తో కలిసి నటించే అవకాశం మిస్సయానంటూ చెప్పుకొచ్చింది సాక్షి వైద్య. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఒకవేళ ఉస్తాద్ భగత్ సింగ్ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోకుండా ఉంటే ఈ మూవీ సాక్షి వైద్య కెరీర్‌కు ప్లస్ అయి ఉండేదనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి రానున్న రోజుల్లో సాక్షి వైద్య, పవన్ కల్యాణ్ కాంబో రిపీట్ అవుతుందేమో చూడాలి.



## ఆ వార్తలు విని అలసిపోయా!

టాలీవుడ్‌కి చెందిన ఓ యంగ్ హీరోతో కథానాయిక మీనాక్షి చౌదరి ప్రేమలో ఉందని, త్వరలో వారిద్దరు పెళ్లిపీటలెక్కబోతున్నారని వార్తలు వినిపించాయి. అయితే వీటిపై ఆమె టీమ్ ఇప్పటికే స్పష్టతనిచ్చింది. ఆ వార్తల్లో నిజం లేదని కొట్టిపారేసింది. తాజా ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి పుకార్లపై మీనాక్షి చౌదరి మాట్లాడింది. తన కెరీర్ ఇప్పుడే ఓ ట్రాక్‌లోకి వచ్చిందని, పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం అస్సలు లేదని స్పష్టం చేసింది. పెళ్లి గురించిన పుకార్లు విని అలసిపోతున్నానని, ఇకనైనా వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది. 'ఎక్కడకు వెళ్లినా పెళ్లెప్పుడనే ప్రశ్నే అడుగుతున్నారు. నేను ఎవరితో డేటింగ్ చేయట్లేదు. ఇప్పుడే పెళ్లి చేసుకునే ఆలోచన కూడా లేదు. మరికొన్నేళ్లపాటు సినిమాలపైనే దృష్టిపెడతాను. నిజంగా పెళ్లి చేసుకునే సమయం వస్తే ఆ విషయాన్ని నేనే ముందుగా తెలియజేస్తా' అని మీనాక్షి చౌదరి వివరణ ఇచ్చింది. ఈ భామ త్వరలో 'అనగనగా ఒక రాజు' సినిమాతో ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తున్నది.

## 'నారి నారి నడుమ మురారి' నుంచి లవ్లీ నెంబర్ 'భల్లే భల్లే' రిలీజ్



చార్మింగ్ స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నటిస్తున్న హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి' జనవరి 14న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయు, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్ర బృందం మ్యూజికల్ ప్రమోషన్స్ ని ప్రారంభించింది. విశాల్ చంద్రశేఖర్ స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ 'భల్లే భల్లే' విడుదలైంది. ఇది యంగ్ లవ్ లోని హ్యాపీనెస్ ని ప్రజెంట్ చేస్తోంది. హరిచరణ్ పాడిన, రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాట విన్న వెంటనే ఆకట్టుకుంటుంది. శర్వా, సాక్షి పాత్రల మధ్య వుండే కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పాట ఒక విజువల్ ట్రీట్ లా వుంది. కేరళలోని పచ్చని ప్రకృతి సౌందర్యం నేపథ్యంలో చిత్రీకరించిన ఈ పాటలోని ఫ్రేమ్‌లు, జంట మధ్య వికసిస్తున్న ప్రేమ అద్భుతంగా చూపించాయి. ప్రతి ఫ్రేమ్ ఈ పాటకు పండుగ వాతావరణాన్ని, చూడముచ్చటైన అనుభూతిని అందిస్తాయి. అద్భుతమైన దృశ్యాలు, కూల్ మ్యూజిక్, లవ్లీ పెర్ఫార్మెన్స్ లతో 'భల్లే భల్లే' పాటను ఒక మరపురాని మ్యూజికల్ మూమెంట్ గా నిలిపాయి. ఈ సాంగ్ ఇన్స్టంట్ గా హిట్ అయ్యింది.

ఈ చిత్రంలో కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు ఒక ప్రత్యేక పాత్రలో నటించగా, సత్య, సునీల్, సుదర్శన్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమాటోగ్రఫీని జ్ఞానశేఖర్ విఎస్, యువరాజ్ నిర్వహించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. భాను బోగవరపు కథను అందించగా, నందు సవిరిగన సంభాషణలు రాశారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. అజయ్ సుంకర సహ నిర్మాతగా, కిషోర్ గరికపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, శ్రీ విష్ణు (స్పెషల్ ఎప్పిరియన్స్), సంయుక్త, సాక్షి వైద్య, నరేష్, సంపత్ రాజ్, సత్య, సునీల్,

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**